క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్అహ్మద్

ఎమ్మిగనూరుటౌన్: మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి.బషీర్అహ్మద్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులైన ప్రస్తుత మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్అహమ్మద్, ఇర్ఫాన్‌లు ఆదివారం పట్టణంలోని తేరుబజారులో పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలో అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. స్థానికులు ప్రకాష్‌జైన్, పక్కీర్‌సాబ్, తెలుగురాముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



శంకరబండ ఎంపీపీ స్కూల్లో పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ఆస్పరి: మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 12 వేల మంది విద్యార్థులకు 92 వేల పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఏంఈఓ రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. పుస్తకాలను వాహనాల ద్వారా స్కూళ్లకు చేరవేశామని, విద్యార్థులకు వాటిని విద్యార్థులకు అందజేశారన్నారు. కొత్త పుస్తకాలు అందడంతో విద్యార్థులు సంతోషపడ్డారు.

కోసిగిలో చోరీ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో నాగన్న కట్ట పక్కనే నివాసం ఉంటున్న వేదపండితులు జయతీర్థ ఆచార్ స్వామి ఇంట్లో దొంగతనం జరిగింది. ఆయన ఈనెల 14న కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి బెంగళూరుకు వెళ్లారు. ఇదే అసరాగా తీసుకున్న దొంగలు ఇంటికి వేసిన తాళం పగులకొట్టి చోరీ చేశారు. ఆదివారం ఉదయం స్థానికులు ఇంటి తలుపులు పగిలి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. స్వామికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఇంటికి వెళ్లి పగిలి ఉన్న గేటుకు మరో తాళం వేసి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం జయతీర్థ ఆచార్ స్వామి గ్రామానికి చేరుకుని పోలీసుల సమక్షంలో ఇంట్లోకి వెళ్లి బీరువా తలుపులు, వస్తువులను తనిఖీ చేసుకున్నారు. దీంతో ఇంట్లో ఉన్న రెండున్నర కేజీ వెండి, రూ.40వేలు నగదు దొంగలించబడినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

హక్కుల సాధనకు పోరాటం



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథన్నను సన్మానిస్తున్న జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గాదిలింగ

ఆలూరు: హక్కులను సాధన కోసం ఐక్యతతో పోరాటాలు చేయాలని రాష్ట్ర ఎమ్మెస్పీఎస్ అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథన్న తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆదివారం జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గాదిలింగ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఆర్థిక, సమాజిక రంగాలలో రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. వచ్చే నెల 15న హైదారాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభకు అందరూ సిద్ధం కావాలని ఆయన కోరారు. నాయకులు, సంజప్ప, బాలరాజు, ఉచ్చీ రంగప్ప, లక్ష్మినారాయణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీడీఓ కార్యాలయ భవనం ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయ భవనం

ఆలూరు రూరల్: మండల కేంద్రమైన ఆలూరులో నిర్మించిన నూతన ఎంపీడీఓ కార్యాలయ భవనం రేపు (మంగళవారం) రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. గతంలో రూర్బన్ పథకం నిధులు రూ.34 లక్షలు, రూ.34 లక్షల జిల్లా పరిషత్ నిధులు మొత్తం రూ.68 లక్షలతో భవనం నిర్మించినట్లు చెప్పారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం ముందు రూ.80 లక్షల రూర్బన్ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను కూడా మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు.

విద్యార్థి వికాసం సర్కారు ధ్యేయం

- రెండు భాషల్లో పాఠ్యాంశాలు
- సులభంగా అర్థమయ్యేలా రూపకల్పన
- మైనర్ భాషల అభివృద్ధికి ప్రాధాన్యం
- చిన్నారుల తల్లిదండ్రులు హర్షాతిరేకం



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు, (ఇన్‌సెట్) రెండు భాషల్లో పాఠ్యాంశం

ఆలూరు: చిన్నారుల్లో విద్యా వికాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వారికి పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బైలింగ్యువల్ (రెండు భాషల్లో పాఠ్యాంశాలు) విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రానికి తెలంగాణతో పాటు తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. విద్యార్థులకు వారి మాతృభాషలోనూ, వారు ఎంచుకున్న మీడియంలో విద్య బోధించేలా గతంలోనే పాఠశాలలను ప్రారంభించారు. విద్యా సంస్కరణలకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అట్టడుగు వర్గాల చిన్నారులు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అభ్యసించేలా వారందరికీ సాంకేతిక విద్యతోపాటు కన్నడ, ఉర్దూ ఇతర మైనార్టీ భాషల విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా బైలింగ్యువల్ విధానాన్ని రూపొందించారు.

బైలింగ్యువల్ విధానం అంటే

ప్రస్తుతం కన్నడ, ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఇంగ్లీష్, ఉర్దూ, కన్నడ ఇలా రెండు భాషల్లో పాఠ్య పుస్తకాలను ప్రత్యేకంగా ముద్రించారు. పుస్తకంలో ఓ వైపు మాతృభాష, మరో వైపు వారు ఎంచుకున్న భాషలో పాఠ్యాంశాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న కన్నడ, ఉర్దూ ఉపాధ్యాయులు ఇంగ్లిష్, ఉర్దూలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేలా రూపకల్పన చేశారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరికీ ఇప్పటికే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. తమిళనాడుకు సమీపంలో ఉన్న తిరుపతి, నెల్లూరు తదితర జిల్లాలో మాతృభాష తమిళం, విశాఖపట్నం సమీపంలో ఒరిస్సా సరిహద్దు ప్రాంత విద్యార్థులకు మాతృభాష ఒరియా కావడం, ఏపీలోని కర్నూలు జిల్లాకు పశ్చిమ ప్రాంతమైన ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మినూరు, తదితర నియోజక వర్గాలకు కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో ఎక్కువ మంది మాతృభాషను కన్నడగా కలిగిఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇతర భాషలు మాతృభాషగా కలిగిన విద్యార్థులు 85,489 మంది చదువుతున్నట్లు అధికారులు గుర్తించారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉర్దూ మీడియం వారికి పుస్తకాలను ఆ భాషతో పాటు ఇంగ్లిష్‌లోకూడా ముద్రించడంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా బోధించేందుకు వెసులుబాటు కలిగింది. ప్రభుత్వ నిర్ణయం భేష్.

– ఎస్ఎస్ బాషా, ఆలూరు ఉర్దూ పాఠశాల కమిటీ చైర్మన్

ప్రభుత్వ విధానం భేష్



నా సర్వీసులో విద్యా విధానంలో ఇలాంటి మార్పులు వస్తాయని ఊహించలేదు. గతంలో ఒకే భాషలో పాఠ్యంశాలు ఉండడంతో విద్యార్థులతో పాటు వారికి బోధించేందుకు ఉపాధ్యాయులకు కూడా సమస్యలు ఎదురయ్యేవి. విద్యా విధానంలో సమూల మార్పులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది.

– వెంకటేష్, స్కూల్ అసిస్టెంట్, కన్నడ పాఠశాల, ఎల్లార్తి గ్రామం

సులభంగా అర్థమవుతున్నాయి



నాకు మొదటి నుంచి తెలుగు మాట్లాడడం రాదు. ఇంట్లో అందరూ కన్నడ మాట్లాడుతారు. మా పాఠశాలలో ప్రస్తుతం బైలింగ్యువల్ విధానంలో కన్నడతో పాఠ్యాంశాలను ఇంగ్లిష్‌తో పోల్చుతూ రెంబు భాషల్లో బోధించడం వల్ల సులభంగా అర్థమవుతున్నాయి.

– శిరీష, ఎల్లార్తి కన్నడ హైస్కూల్ విద్యార్థి

మా పిల్లలకు మంచి చేశారు



ఆంధ్రా, కర్ణాటకకు సరిహద్దు ప్రాంతంలో ఉన్నాం. ఇక్కడ వాడుక భాష కన్నడ. మా పిల్లలు అందులోనే చదివితే బాగుంటుందని ఆశించాం. ఈ మేరకు ప్రభుత్వం పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా రెండు భాషల్లో పుస్తకాలను ముద్రించి ఇచ్చింది. చాలా మంచి విధానం.

– ఎల్లమ్మ, ఎల్లార్తి జెడ్పీ కన్నడ హైస్కూల్ కమిటీ చైర్మన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో నెలకొన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బసవరాజు, నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, చిన్న తిమ్మన్న కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ప్రధానోపాధ్యాయుల సమావేశానికి హాజరైన డీఈఓ రంగారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ఇటీవల పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులు జూన్ వేతనాలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. క్యాడర్ స్ట్రెంత్, డీడీఓ కోడ్స్ లేని కారణంగా జూలై వేతనాలు కూడా అందని పరిస్థితి ఏర్పాడుతోందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు సురేష్, సిద్ధలింగమూర్తి, నాగరాజు, వెంకట్రాముడు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎంపీసీలో ఎస్సీ–15, ఎస్టీ–2, సీఈసీలో ఎస్సీ–12, ఎస్టీ–1, హెచ్ఈసీలో ఎస్సీ–24, ఎస్టీ–2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26న పాఠశాలలో జరిగే స్పాట్ అడ్మిషన్ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పదో తరగతిలో రెగ్యులర్‌గా పాసైన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని, అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్ల నకళ్లను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు.

అనుమతి లేని పాఠశాలను రద్దు చేయాలి



డీఈఓ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అనుమతి లేకుండా రెండో బ్రాంచ్ ప్రారంభించిన భాష్యం పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలో డీఈఓ రంగారెడ్డి నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగిన సమావేశంలో వారు బైఠాయించి నినాదాలు చేస్తూ గంటపాటు అధికారులతో వాగ్వాదం చేశారు. ఎంఈఓలు ఆ పాఠశాలకు వెళ్లి సీజ్ చేసినా మళ్లీ పునఃప్రారంభించడం ఎంతవరకు సమంజసం అని వారు డీఈఓను ప్రశ్నించారు. ఆ పాఠశాలను సందర్శించి కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయా విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, ఉదయ్, రాజేష్,ఖాజ, కృష్ణ ,సురేష్ తదితరులు డీఈఓను పట్టుబట్టారు. దీంతో డీఈఓ స్థానిక ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్‌రాజులను వెంటబెట్టుకొని హెబీఎస్ కాలనీలో ప్రారంభించిన భాష్యం రెండో బ్రాంచ్ పాఠశాలను పరిశీలించగా తాళం వేసి ఉండటంతో ప్రిన్సిపాల్ కవితతో ఫోన్‌లో మాట్లాడి హెచ్చరికలు జారీ చేశారు. అనుమతి లేకుండా పాఠశాల ప్రారంభిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పరామర్శ



మంత్రి గుమ్మనూరు జయరాంకు వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందజేస్తున్న దశ్యం


ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ సమీపంలోని ఐకొండ వద్ద వీఆర్‌పీఎస్ నాయకులు వీజీఆర్ కొండయ్యను ఫాంహౌస్‌లో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పరామర్శించారు. కొండయ్యకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న మంత్రి జయరాం ఆదివారం ఆయన్ను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వాల్మీకి వనభోజన సమితి నాయకులు మంత్రి గుమ్మనూరు జయరాంను కలసి వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని అందజేశారు. వాల్మీకులందరూ ఐకమత్యంతో సాగాలని మంత్రి సూచించారు. అనంతరం అక్కడే భోజనం చేసి మంత్రాలయం వెళ్లారు. మంత్రితో పాటు గుమ్మనూరు నారాయణస్వామి, రాంభీంనాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, వాల్మీకి వనభోజన సమితి నాయకులు, తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్ స్థలంలో దుకాణం



ఇంగదహాళ్ గ్రామంలో బస్‌షెల్టర్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన దుకాణం

ఆలూరు: బస్‌షెల్టర్ స్థలం ఆక్రమించుకుని దుకాణం ఏర్పాటు చేసుకున్న ఘటన హొళగుంద మండలంలోని ఇంగళదహాల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామాల నుంచి పట్టణ కేంద్రాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థంలో గతంలో రూ.లక్ష వ్యయంతో బస్‌షెల్టర్లు నిర్మించారు. గ్రామస్తులు తమ బంధువులను ఊర్లకు సాగనంపే సమయంలో బస్సు వచ్చేవరకు షెల్టర్‌లో వేచి ఉండేవారు. అయితే చాలా గ్రామాలు, మండల కేంద్రాల్లో బస్‌షెల్టర్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు షెల్టర్లను తమ ప్రభుత్వం హయంలో ఏర్పాటు చేశారని, తమకు సర్వహక్కులు ఉన్నాయని బుకాయిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతో మనకేందుకులే అంటూ ప్రయాణికులు, గ్రామస్తులు, వృద్ధులు ఊరుకుండిపోతున్నారు. హొళగుంద మండలం ఇంగళదహళ్ గ్రామంలో బస్‌షెల్టర్ స్థలాన్ని ఆక్రమించుకుని అడ్డంగా దుకాణం ఏర్పాటు చేయడంతో షెల్టర్ నిరుపయోగంగా మారింది. దీంతో రాత్రిళ్లు మందుబాబులు ఆవాసంగా మార్చుకున్నారు. గ్రామ పంచాయతీ, ఆర్టీసీ అధికారులు స్పందించి షెల్టర్లను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



నాగలదిన్నెలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

జోరుగా వరి నాట్లు



చిన్నకొత్తిలిలో గట్టుపై సద్దులు ఆరగిస్తున్న కూలీలు



వరి మడిని సిద్ధం చేస్తున్న అన్నదాత

నందవరం: వానలు కురిసి తుంగభద్రలో పాక్షికంగా వరద నీరు పారుతుడడంతో తుంగ తీరం వెంట వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. తుంగ తీరం దాదాపు 24 కిలో మీటర్ల వరకు వరి నాట్లు ఊపందుకున్నాయి. తీరప్రాంతాలలో నేల తల్లిబిడ్డల మోములో ఆనందం నింపింది. వరి రైతులు నాట్లకు నడుం బిగించడంతో తీరమంతా సందడి నెలకొంది. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు వరినాట్లలో బిజీ బిజీగా ఉన్నారు. చిన్నకొత్తిలి గ్రామంలో వరి మడి గట్ల మీద ఒకే బంతిలా వ్యవసాయ కూలీలు సద్దులు ఆరగిస్తూ సందడి చేశారు. మండలంలో ఇప్పటివరకు 600 ఎకరాలలో రైతులు వరి నాట్లు వేశారు. మండలంలో దాదాపు 3,000 ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వానలు కాస్త ఆలస్యమైనా ఓ మోస్తరుగా కురవడంతో ఎన్నో ఆశలతో నాట్లకు సిద్ధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అండగా వరికి గిట్టుబాటు ధర కల్పించింది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 35 నుంచి 45 బస్తాల దిగుడులు లభిస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మంత్రి రాక

దేవనకొండ: మండలంలోని జిల్లెడబుడకల గ్రామంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీఓ గౌరీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. అన్నిశాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 26వ తేదీన గుండ్లకొండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

హొళగుంద: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పెద్దగోనెహాళ్ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరిగాయి. వర్షపు నీరు నిల్వ ఉండకుండా, వీధుల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్సీ కాలనీలోని డ్రైనేజీలలో చెత్త చెదారం, మురుగునీరు, పూడికను తొలగించి దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. అలాగే ముళ్ల కంపలను తొలగించారు. అదేవిధంగా ఎల్లార్తి గ్రామంలోని లింగంపల్లి రస్తా, దర్గా పరిసరాల్లో గ్రామపెద్ద మల్లికార్జున రోడ్డుపై చేరిన బురద మట్టిని తొలగించారు.

చింతకుంటలో లోపించిన పారిశుద్ధ్యం

హాలహర్వి: ఓ వైపు కురుస్తున్న వర్షాలు.. మరోవైపు రోడ్లపై పారుతున్న మురుగు నీరు. ఎక్కడ చూసినా అస్తవ్యస్తం. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు మురుగుతో కలిసి రోడ్లపై పారుతున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతకుంట గ్రామంలో డ్రెయినేజీ కాలువలను శుభ్రపరచడం లేదు. దీంతో పారిశుద్ధ్యం లోపించింది. జీతాలు రావడం లేదని పారిశుద్ధ్య కార్మికులు పనులు చేయడం మానేశారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి పారిశుద్ధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరులో నాటుసారా విక్రయిస్తున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మురళీ మోహన్ తెలిపారు. సారా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకొని 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

రెడ్డి బావిలో శ్రమదానం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని రెడ్డిబావిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు, భక్తాదులు శ్రమదానం చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం అర్చకులు నరసింహరావు ఆంజనేయ స్వామికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తాదులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు వీరరాజు, భాస్కర్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పురాతన ఆలయంపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో శంకరయ్యాచారి, రామలింగయ్య,కరణంనరేష్, హరి పాల్గొన్నారు.

పీర్ల పెట్టె ఊరేగింపు

తుగ్గలి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలితో పాటు పలు గ్రామాల్లో పీర్ల పెట్టెను ఊరేగింపు చేశారు. పీర్లు ఉంచి పెట్టెను పూలతో అలంకరించి చావిడిలో ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మేళ తాళాలు, తప్పెట్లతో పెట్టెను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

సేవకు సలాం



ఎమ్మిగనూరులో బాలిక శారోణికి ఫించన్ అందిస్తున్న వలంటీర్ వెంకట రాముడు

ఆస్పరి: ఈ చిత్రంలో ఉన్న బాలిక పేరు శారోణి, వయసు 11 ఏళ్లు. శారీరక, మానసిక దివ్యాంగురాలు. ఆస్పరి మండలం పుటుకలమర్రి గ్రామస్తురాలు. తల్లిదండ్రులు నాగేంద్ర, సువార్తమ్మ దంపతులు, వీరికి నలుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. శారోణి నాల్గవ సంతానం. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శారోణి బాగోగులు చూసుకోవడానికి ఇంటి దగ్గర ఒక వ్యక్తి ప్రత్యేకంగా ఉండాల్సిన పరిస్థితి. ఇంటి వద్ద ఒకరు ఉంటే జీవనం కష్టమవుతుందని అమ్మమ్మ శారోణిని ఎమ్మిగనూరుకు తీసుకెళ్లింది. దీనస్థితిలో ఉన్న కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తూ వలంటీర్ వెంకటరాముడు ఆసరాగా నిలిచారు. శారోణికి దివ్యాంగ ఫించన్ మంజూరు చేయించడమే కాకుండా మూడేళ్ల నుంచి 40 కి.మీ దూరంలో ఉన్న ఎమ్మిగనూరుకు వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తున్నాడు.

పింఛన్ డబ్బులే ఆసరా



ప్రభుత్వం ప్రతి నెలా అందించే పింఛన్ డబ్బులు నా కూతురు శారోణి మందులకు ఉపయోగపడుతున్నాయి. మా ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మా అత్త రాణెమ్మ నా కూతురు బాగోగులు చూసుకుంటోంది. వలంటీర్ వెంకటరాముడు పింఛన్ మంజూరు చేయడమే కాకుండా ఎమ్మిగనూరుకు వెళ్లి పింఛన్ డబ్బులు ఇచ్చి వస్తున్నాడు. వలంటీర్ ఉండడం వల్ల మాలాంటి వాళ్లకు ఎంతో ఉపయోగం. – నాగేంద్ర, పుటకలమర్రి గ్రామం, ఆస్పరి మండలం

నంద్యాలకు వెళ్లి ఫించన్ పంపిణీ



నంద్యాలకు వెళ్లి పీర్ సాహెబ్‌కు పింఛన్ అందిస్తున్న వలంటీర్ పుష్పలత

ఆస్పరి: ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన పింజరి పీర్ సాహెబ్ అనే వృద్ధుడు కాలికి గాయమై నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ సమయంలో ముత్తుకూరు వలంటీర్ పుష్పలత నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. ముత్తుకూరు నుంచి 150 కి.మీ దూరం వెళ్లి పింఛన్ ఇవ్వడంతో పీర్ సాహెబ్ సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

దూరం అయినా పింఛన్ తెచ్చి ఇచ్చారు

నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాకు వలంటీర్ పుష్పలత పింఛన్ డబ్బులు తెచ్చి ఇవ్వడంతోనే వైద్యం ఖర్చులకు ఎంతో ఉపయోగపడ్డాయి. మహిళ అయినా అంత దూరం వచ్చి పింఛన్ ఇవ్వడం గొప్ప విషయం. ఆపద సమయంలో సహాయ పడడం ఎన్నటికీ మరువలేను. – పీర్ సాహెబ్, ముత్తుకూరు గ్రామం, ఆస్పరి మండలం

మణిపూర్ ఘటన దేశానికే మచ్చ



ఆలూరులో ర్యాలీ చేస్తున్న మాలమాహానాడు నాయకులు

ఆలూరు: మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చ అని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహానంది అన్నారు. ఆ ఘటనను ఖండిస్తూ ఆలూరులో ఆదివారం మాల మహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆడ పడుచులను వివస్త్ర చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు నాయకులు ఈరన్న, లక్ష్మినారాయణ, రామచంద్ర పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: మణిపూర్‌లో మహిళను వివస్త్ర చేసి అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేసి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ.. మణిపూర్ మారణ హోమాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించి ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమాఖ్య నాయకులు నాగవేణి, ఉరుకుందమ్మ, లక్ష్మి, సరోజ, రంగవేణి, సీపీఐ నాయకులు రంగన్న, భాస్కర్‌యాదవ్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

25న మద్దికెరలో 'జగనన్న సురక్ష'

మద్దికెర: ఈ నెల 25వ తేదీన మంగళవారం మద్దికెరలోని కెనరా బ్యాంకు వద్ద ఉన్న సచివాలయం–3 లో ఉదయం 10 గంటల నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. వలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు కావలసిన ధ్రువపత్రాల గురించి తెలియజేసి సచివాలయంలో సంప్రదించేలా చూడాలన్నారు. నమోదు చేసుకున్న వారికి అధికారులు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తారని వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ సమీపంలో కంబయ్యకట్ట వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. గవిగట్టు గ్రామానికి చెందిన ఉప్పర మహాదేవప్ప అక్రమంగా తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌పై 182 మద్యం ప్యాకెట్లను (90ఎంఎల్) తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. మోటార్ సైకిల్, మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అక్రమ కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.